
సాక్షి
తిరుపతి
మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



తెప్పపై కల్యాణ వెంకన్న
గోవిందరాజస్వామి తెప్పోత్సవాల్లో భాగంగా స్వామివారు కల్యాణ వెంకన్న అలంకరణలో విహరిస్తూ కనువిందు చేశారు. - 8లో



చరిత్రలో నిలిచేలా అభివృద్ధి
చరిత్రలో నిలిచేలా చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్టు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. - 8లో



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు
రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి కార్ల లోడ్‌తో వెళుతున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. - 8లో

న్యూస్‌రీల్

కొండపై శ్రీలీల సందడి



శ్రీవారి ఆలయం ఎదుట హీరోయిన్ శ్రీలీల

తిరుపతి(అలిపిరి) : సినీ హీరోయిన్ శ్రీలీల కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండలంలో అధికారులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

జర్నలిస్టులకు మరో అవకాశం

– ఇంటి స్థలాల దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి అర్బన్: జర్నలిస్టుల ఇంటి స్థలాలకు దరఖాస్తు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఆ మేరకు సోమవారం సమాచార పౌరసంబంధాలశాఖ రాష్ట్ర కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి పేరుతో జిల్లా సమాచార అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి మేరకు వివిధ కారణాలతో ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోని.. అర్హులైన జర్నలిస్టులకు మరో ఛాన్స్ కల్పించినట్టు వెల్లడించారు. సోమవారం నుంచి ఈనెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి వీలుంటుందని తెలిపారు. ఇప్పటికే నమోదు చేసుకుని సబ్మిట్ కొట్టని వారికి అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోయి ఉంటే వారంతా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఐపీఆర్.ఏపీ. జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు చిత్తూరులో జాబ్ మేళా



లోకనాథం

తిరుపతి అర్బన్: చిత్తూరు ఆర్‌వీఎస్ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ – టెక్నాలజీలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం సోమవారం తెలిపారు. రాయలసీమతోపాటు నెల్లూరు జిల్లాకు చెందిన వారు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ జాబ్ మేళాకు ఐటీ సెక్టార్, బీపీఓ సెక్టార్, ఎలక్ట్రానిక్ సెక్టార్, రిటైల్ సెక్టార్, మ్యానుఫ్యాక్చరింగ్ సెక్టార్, బీఎఫ్ఎస్ఐ సెక్టార్లకు సంబంధించిన వందకు పైగా బహుళ జాతీయ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్హతలు ఐదో తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీ, బీటెక్, ఏదైనా పీజీలో ఉత్తీర్ణత అయిన యువతీ యువకులు అర్హులన్నారు. హాజరయ్యే వారు రిజిస్ట్రేషన్ లింకులో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, అదేవిధంగా ఆధార్ కార్డ్ జిరాక్స్, బయోడేటా ఫామ్, జిరాక్స్ సర్టిఫికెట్స్ తీసుకురావాలని సూచించారు. వివరాలకు 9063561786, 8465830771, 8142509017 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గ్లోబల్ వర్సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- మీడియా సమావేశంలో మహిళా వర్సిటీ వీసీ డీ.భారతి



మాట్లాడుతున్న వీసీ భారతి, రిజిస్ట్రార్ రజిని

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీని గ్లోబల్ వర్సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వర్సిటీ వీసీ డీ భారతి స్పష్టం చేశారు. సోమవారం తిరుపతి మహిళా వర్సిటీ వీసీ చాంబర్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. దేశంలోని 26 యూనివర్సిటీలకు మాత్రమే కేంద్రం ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ (పీఎం–యూఎస్‌హెచ్‌ఏ) పథకం ద్వారా నిధులు కేటాయించినట్టు వెల్లడించారు. మన రాష్ట్రంలో మహిళా యూనివర్సిటీకి మాత్రమే వంద కోట్ల రూపాయలు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. వర్సిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.50 కోట్లు, భవనాల పునర్నిర్మాణానికి రూ.15 కోట్లు, ల్యాబ్, పలు విభాగాలకు అవసరమైన పరికరాల కోసం రూ.20.10 కోట్లు, సాఫ్ట్ కాంపోనెంట్ కోసం రూ.14.90కోట్లు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. పీఎం–ఉషా పథకం కింద నిధులను మంగళవారం ప్రధానమంత్రి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభిస్తారని తెలిపారు. గతంలో రూసా పథకం కింద రూ.25కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. వచ్చేనెల 7వ తేదీన వర్సిటీ కాన్వొకేషన్‌ను నిర్వహిస్తామని, 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఎస్ రజిని, పీఆర్‌ఓ రజిని పాల్గొన్నారు.

పేద కాపులకు నేస్తం

నాడు

టీడీపీ పాలనలో కాపులకు తీవ్ర అన్యాయం జరిగింది. వారి సమస్యలను విస్మరించారు. కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని వదిలేశారు. వారు ఎదిగితే తనకు సమస్య వస్తుందని గ్రహించిన చంద్రబాబు కుట్రలకు తెరలేపారు. ఎన్నికల్లో మాత్రం వారికి ఊరించే హామీలు గుప్పించడం, తరువాత మర్చిపోవడం బాబు నైజమన్న విషయం కాపులకు తెలిసింది.

నేడు

కాపుల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ కాపునేస్తం పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం అమలుపై గత ఎన్నికల మేనిఫెస్టోలో ఎలాంటి హామీ ఇవ్వలేదు. అయినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కాపుల సంక్షేమానికి కాపు నేస్తం పథకాన్ని అమలు చేశారు. అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో ప్రతి ఏటా రూ.15 వేలు నేరుగా జమచేశారు.



చిత్తూరు జిల్లాలో కాపునేస్తం పథకం మెగా చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు(ఫైల్)

కాపు నేస్తం పథకం వివరాలు

చిత్తూరు జిల్లాలో లబ్ధిదారులు	25,444 మంది
ఖర్చు చేసిన మొత్తం	రూ.38.18 కోట్లు
తిరుపతి జిల్లాలో లబ్ధిదారులు	17,274 మంది
ఖర్చు చేసిన మొత్తం	రూ.25.91 కోట్లు
రెండు జిల్లాల్లో లబ్ధి పొందిన వారు	42,718
రెండు జిల్లాల్లో ఖర్చు చేసిన మొత్తం	రూ.64.09 కోట్లు



- మేనిఫెస్టోలో చెప్పకపోయినాపథకం అమలు
- ప్రతి ఏటా లబ్ధిదారులకు రూ.15 వేలు అందజేసిన సీఎం జగన్
- గత పాలనలో మోసం చేసిన బాబు
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 42,718 మందికి లబ్ధి

చిత్తూరు కలెక్టరేట్ : కాపు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ సర్కారు వైఎస్సార్ కాపునేస్తం పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వేలాది మంది అర్హులకు ఆర్థిక సాయం అందించారు. ప్రతి ఏటా కాపునేస్తం పథకంలో లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఖాతాల్లో నగదు జమచేసింది. ప్రతి ఏటా సర్కారు అందజేసిన రూ.15 వేల నగదును కాపులు సద్వినియోగం చేసుకున్నారు. గతంలో ఏ సర్కారు చేయని మేలును కాపు వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసింది. కాపు నేస్తం పథకం అమలుపై 'సాక్షి' కథనం.

మేనిఫెస్టోలో చెప్పకపోయినా..

గత ఎన్నికల్లో కాపు నేస్తం పథకం అమలుపై ఎలాంటి హామీ ఇవ్వకపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కాపునేస్తం పథకాన్ని అమలు చేసింది. ఈ పథకంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు మేలు చేకూరింది. కాపు నేస్తం పథకంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మిగిలిన అన్ని సంక్షేమ పథకాలు కాపు కులస్తులకు అందాయి. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో కాపునేస్తం పథకాన్ని సర్కారు అమలు చేసింది. చిత్తూరు జిల్లాలో నాలుగు విడతల్లో 25,444 మందికి రూ.38.18 కోట్లను, తిరుపతి జిల్లాలో 17,274 మందికి రూ.25.91 కోట్లు రెండు జిల్లాల్లో మొత్తం 42,718 మందికి గాను రూ.64.09 కోట్లు సర్కారు ఖర్చు చేసింది.

కిరాణాకొట్టు నడుపుతున్నా



కాపునేస్తం ద్వారా నాకు రూ.60 వేలు ఆర్థిక సాయం అందింది. ఆ సాయంతో కిరాణా కొట్టు నడుపుతూ కుటుంబానికి అండగా ఉన్నా. ప్రస్తుత ప్రభుత్వం కాపులకంటూ ప్రత్యేకంగా ఒక పథకాన్ని పెట్టి ఆర్థిక సాయం అందించడం విశేషం. ఇంతగా సాయపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా.

– కాటమ్మ, అత్తూరు, నింద్ర మండలం, చిత్తూరు జిల్లా

రెండు ఆవులను కొన్నా



కాపు నేస్తం పథకం ద్వారా వచ్చిన నగదుతో రెండు ఆవులను కొనుగోలు చేసుకున్నాను. గత పాలకులెవ్వరూ మాకు మేలు చేయనేలేదు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వల్ల మాకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. కాపు నేస్తంతో పాటు పలు రకాల పథకాల కింద లబ్ధి పొందాను. మాకోసం ఇంత చేస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాం.

– నాగభూషణమ్మ, యాదమరి మండలం, చిత్తూరు జిల్లా

టైలరింగ్ మిషన్లు కొనుగోలు చేసుకున్నా



కాపు నేస్తంతోపాటు పలు సంక్షేమ పథకాల ద్వారా వచ్చే నగదుతో టైలరింగ్ మిషన్లు కొనుగోలు చేసుకుని జీవిస్తున్నాను. భర్త ఆకస్మికంగా మృతి చెందడంతో వితంతు పింఛన్ వస్తోంది. వై.ఎస్.ఆర్ ఆసరా, సున్నా వడ్డీ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నాను. గతంలో ఎప్పుడూ ఇన్ని పథకాలు అందలేదు. జగనన్న చేసిన మేలు జీవితంలో మర్చిపోలేను.

– వాణి, చిత్తూరు నగరం, చిత్తూరు జిల్లా

ఇప్పుడు సంతోషంగా ఉన్నాం



కాపునేస్తం పథకం కింద ఇచ్చిన నగదుతో పాడి ఆవులను కొనుగోలు చేసుకున్నాము. ఆ ఆవులు రోజుకు 8 లీటర్ల పాలు ఇస్తున్నాయి. వీటిని విక్రయించి జీవనం సాగిస్తున్నాం. ఇంకా ఆసరా, సున్నా వడ్డీ రుణాలు ఇచ్చారు. ఇప్పుడు మా ఇంటిల్లి పాది సంతోషంగా ఉన్నాము. జగనన్న రుణం మరిచిపోలేము. ఆయన్ను మళ్లీ సీఎంగా గెలిపించుకుంటాం.

– బేబి, యాదమరి మండలం, చిత్తూరు జిల్లా



తిరుపతి జిల్లాలో లబ్ధిదారులకు కాపునేస్తం మెగాచెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు(ఫైల్)

గతంలో అన్యాయం



గత టీడీపీ పాలనలో మాకు అన్యాయం జరిగింది. మా గురించి పట్టించుకునేవారే లేరు. మనదేశంలో ఎక్కడాలేని విధంగా బలిజ/కాపు కులస్తులను ఆదుకునే ఉద్దేశంతో వైఎస్సార్ కాపునేస్తం పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. దీంతో మేమంతా ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నాయి. మేమంతా జగనన్నకే మద్దతు తెలుపుతాం.

– డి.చంద్రమ్మ, బలిజ వీధి, సత్యవేడు, తిరుపతి జిల్లా

కొడుకులా ఆదుకుంటున్నాడు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సొంత కొడుకులా ఆదుకుంటున్నాడు. కాపునేస్తం ద్వారా నాకు నాలుగు వాయిదాల్లో రూ. 60 వేలు అందింది. అది నా కుటుంబానికి ఎంతో ఉపయోగపడింది. నాలా ఎందరికో కాపునేస్తం అండగా నిలుస్తోంది. ఇలాంటి మంచి పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిందే.

– సనపల్లి గౌరమ్మ, గట్టు, పుత్తూరు మండలం, తిరుపతి జిల్లా

కాపునేస్తం మాకెంతో ఆధారం



మా జీవనానికి కాపు నేస్తం కాస్త ఆధారంగా నిలిచింది. నేను వరుసగా నాలుగేళ్లు లబ్ధి పొందాను. ఏటా రూ.15 వేలు చొప్పున నాలుగేళ్లకు రూ.60 వేలు నా ఖాతాలో జమ చేశారు. పేదల కుటుంబాలకు ఈ పథకం ఎంతో దోహదపడుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మేం ఎంతో రుణపడి ఉన్నాం.

– వనమ్మ, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా

కాపులకు ప్రత్యేక గుర్తింపు



ఇప్పటి వరకు కాపుల పేదరికాన్ని ప్రత్యేకంగా గుర్తించి వారికి సాయం చేసిన నేతలు ఎవ్వరూ లేరు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాపునేస్తం పేరుతో 45–60 ఏళ్ల వయస్సు వారికి ఏటా రూ.15వేలు వారి ఖాతాల్లో జమ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. నాలుగేళ్లలో రూ.60వేలు లబ్ధిపొందాను.

–డి.వసంత, బలిజ వీధి, సత్యవేడు, తిరుపతి జిల్లా

జగనన్నకు రుణపడి ఉంటాం



పేద కాపులకు వైఎస్సార్ కాపునేస్తం ఓ వరంలాగా భావిస్తున్నాం. ఆ పథకం ద్వారా నాలుగేళ్లు వరుసగా ప్రతి ఏటా రూ.15వేలు చొప్పున రూ.60వేలు మా ఖాతాలోకి డబ్బులు వేశారు. దీంతో మా కుటుంబ అవసరాలకు ఆ నగదును సద్వినియోగం చేసుకున్నాం. ఇంత మంచి చేస్తున్న క్రమంలో మళ్లీ జగనన్నే సీఎంగా గెలిపించుకుంటాం.

– జి.సావిత్రమ్మ, గాయత్రీనగర్, తిరుపతి

మల్లేశ్వరునికి శివయ్య సారె

శ్రీకాళహస్తి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన మల్లేశ్వరాలయ కుంభాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పట్టు వస్త్రాలతో కూడిన సారెను అందించారు. సోమవారం ఆలయ అధికారులతో కలిసి విజయవాడకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారికి సారె సమర్పించారు. అర్చకులు సంబంధం గురుకుల్, ఏఈఓ ధనపాల్ పాల్గొన్నారు.



సారె అందిస్తున్న శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

23న వరసిద్ధుని హుండీ లెక్కింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి హుండీ లెక్కింపును ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి స్వామివారి ఆస్థాన మండపంలో నిర్వహించే కానుకల లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది హాజరుకావాలని ఆదేశించారు.

ప్రతి అర్జీకి పరిష్కారం

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 135 వినతులు వచ్చినట్టు ఆయన వెల్లడించారు. ఇందులో అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించి 104 వినతులు ఉన్నట్టు వెల్లడించారు.



అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్వో పెంచలకిషోర్

తక్షణం స్పందించాలి

'ఇక్కడ నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజలు భారీగానే తరలివచ్చారు. అయితే ఎక్కడా సంక్షేమ పథకాలకు సంబంధించిన ఫిర్యాదులు అందలేదు. ఎక్కువగా భూసమస్యలపైనే అర్జీలు వచ్చాయి. ప్రజల వినతులు నేరుగా సీఎంకు అందించనట్లుగానే అధికారులు భావించాలి. బాధితులను ఎక్కువ సార్లు తిప్పించుకోకుండా మానవతాదృక్పథంతో స్పందించి పరిష్కరించాలి. సంక్షేమ పథకాలపై ఫిర్యాదులు లేకపోవడం సంతోషాన్నిస్తోంది'.. అని కలెక్టర్ జీ.లక్ష్మీశ తెలిపారు. సోమవారం గూడూరులో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- వినతులు సీఎంకే అందిస్తున్నట్లుగా అధికారులు భావించాలి
- సంక్షేమ పథకాలకు సంబంధించిన ఫిర్యాదులు తక్కువే
- గూడూరు స్పందనలో కలెక్టర్ లక్ష్మీశ



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



దివ్యాంగునికి ట్రైసైకిల్ అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు రూరల్: భూ సమస్యలను మానవతా దృక్పథంతో స్పందించి పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ జీ.లక్ష్మీశ అధికారులకు సూచించారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలలో వస్తున్న అర్జీలు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఇచ్చినట్లుగానే భావించాలని తెలిపారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సోమవారం డివిజన్ స్థాయి ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన సుమారు 156 మంది వినతులు సమర్పించారు. ఇందులో 134 అర్జీలు రెవెన్యూ సమస్యలకు సంబంధించినవిగా అధికారులు గుర్తించారు.

స్పందిస్తూ..ఆదేశాలిస్తూ..

ఓ దివ్యాంగునికి అక్కడికక్కడే ట్రై సైకిల్ అందించేలా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. మూడేళ్లుగా ఆధార్‌కార్డు కోసం తిరుగుతున్న మరో కుటుంబానికి ఆధార్‌కార్డు నమోదు చేయించారు. బాలాయపల్లి మండలం, సుబ్రహ్మణ్యం గ్రామంలో పొదుపు మహిళలు 18 ఏళ్లుగా కొనసాగుతుండగా వారికి గత 10 నెలల నుంచి బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్య పరిష్కరించాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. తీపనూరుకు చెందిన పెంచలమ్మ వితంతు పింఛన్ సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించడంతో ఆమె ఉప్పొంగిపోయారు. గూడూరు రూరల్ ప్రాంతంలోని తుంగపాళెం కలర్ షైన్ కంపెనీ విస్తరణలో భాగంగా మరో పరిశ్రమను అనుమతులు లేకుండా చేపడుతున్నారని ఎంపీపీ గురవయ్యతో పాటుగా స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు చెప్పారు. బాలాయపల్లి మండలం, కయ్యూరు గ్రామానికి చెందిన చెంచుగోపాల్ నాయుడు పేరుతో ఉన్న భూమిని గ్రామానికి చెందిన కొంతమంది తనఖా పెట్టి ఎస్‌డీసీ బ్యాంకులో రుణాలు పొందారని, దీనివల్లన ఆ భూమిపై ఎలాంటి హక్కులు లేకుండా పోతున్నాయని బాధితుడు ఫిర్యాదు చేయగా.. దీనిపై విచారణ చేయాలని సూచించారు. చిల్లకూరు మండలం, బల్లవోలు, కడివేడు గ్రామానికి చెందిన దళితులు తమ అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని విన్నవించారు. దీనిపై చిల్లకూరు తహసీల్దార్‌ను పరిశీలించి నివేదికలు ఇవ్వాలని చెప్పారు.

ఎన్నికలకు సిద్ధం

సార్వత్రిక ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన పరిశీలించారు. పాఠశాలలోని 8, 9 తరగతులకు వెళ్లి విద్యార్థులతో మమేకమయ్యారు. డిజిటల్ బోర్డుపై పాఠ్యాంశాలను ఎలా బోధిస్తున్నారు.. అనే విషయాలను విద్యార్థులతో కలిసి తిలకించారు. బోధన బాగుందని, వెనుక బెంచీలో ఉన్న విద్యార్థులకు కూడా కనిపించేలా జూమ్ చేసి బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, డివిజన్ స్థాయిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

శివజ్యోతినగర్‌లో చోరీ

తిరుపతి(అలిపిరి): తిరుపతి శివజ్యోతినగర్‌లోని ఓ ఇంటో ఆదివారం దొంగలు పడ్డారు. శివజ్యోతినగర్‌లో ఎం.వినాయకం ఉంటున్నారు. ఆయన ప్రయివేటు ఉద్యోగి. భార్య ప్రసవం కావడంతో ఆస్పత్రికి వెళ్లి వచ్చేలోపు తలుపులు తెరిచి ఉండడంతో అవాక్కయ్యారు. ఇంట్లో బీరువా తెరిచి ఉండడం.. 113 గ్రాముల బంగారం అపహరణకు గురవడంతో అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అలిపిరి ఎస్‌ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరదరాజనగర్‌లో మరో చోరీ...

వరదరాజనగర్‌లోని నారాయణరావుకు చెందిన ఓ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. వెనుక భాగం నుంచి ఇంట్లోకి చొరబడి పలు వస్తువులు ఎత్తుకెళ్లారు. చెన్నైలో నివాసం ఉంటున్న నారాయణరావు అప్పుడప్పుడూ వచ్చిపోతుంటారు. విషయం తెలుసుకున్న బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

పందెం రాయుళ్ల అరెస్ట్

శ్రీకాళహస్తి: కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడులు చేసి, తొమ్మిదిమందిపై కేసులు నమోదు చేసిన సంఘటన తొట్టంబేడు మండలం, రౌతుసూరమాల వద్ద సోమవారం జరిగింది. ఎస్‌ఐ రాఘవేంద్ర కథనయి.. రౌతుసూరమాల పంట పొలాల్లో కోడిపందేలు ఆడుతున్నట్టు సమాచారం అందడంతో దాడులు చేసి రెండు కోళ్లు, రూ.4 వేలు స్వాధీనం చేసుకుని, పుల్లూరు, పునబాక, శ్రీకాళహస్తి ప్రాంతాలకు చెందిన తొమ్మిదిమంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చరిత్రలో నిలిచేలా చంద్రగిరి అభివృద్ధి



తనపల్లిలో ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు మెగా చెక్కును అందిస్తూ



తనపల్లి, కుంట్రపాకంలో ప్రజలకు అభివాదం చేస్తున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

- అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనలో చరిత్రలో నిలిచేలా చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశామని తుడా చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తిరుపతి రూరల్ మండలంలో ఆయన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని చేపట్టారు. బ్రాహ్మణపట్టు, ముళ్లపూడి, కుంట్రపాకం, తనపల్లి, ఓటేరు పంచాయతీలలో పర్యటించారు. ఆయా పంచాయతీల్లో పార్టీ జెండాలు, సంక్షేమ బోర్డులు ఆవిష్కరించారు. కుంట్రపాకం పంచాయతీలో రూ.15 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.14 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా చెక్కులు అందజేశారు.

అపూర్వ స్వాగతం

ఆయా పంచాయతీల్లో మోహిత్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. ముళ్లపూడి పంచాయతీలో క్రేన్ ద్వారా భారీ గజమాల వేసి గ్రాండ్ వెల్కమ్ చెప్పారు. అడుగడుగునా మహిళలు హారతులు పట్టి, పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతించారు. పూలమాలలు వేస్తూ పార్టీ శ్రేణులు అభిమానాన్ని చాటుకున్నారు.

అర్హతే ప్రామాణికం

మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా.. సీఎం జగనన్న సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు వెల్లడించారు. గడిచిన నాలుగున్నరేళ్లలో అనేక సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి తలుపు తట్టాయన్నారు. అర్హత ఒక్కటే ప్రామాణికంగా, అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగనన్నదేనన్నారు. మరోవైపు దేశం గర్వపడేలా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందజేస్తున్నట్టు తెలిపారు. గాంధీజీ కలలు నిజం చేస్తూ గ్రామస్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా సార్థకమైందన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలు అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా ముందుకు సాగుతున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. బ్రాహ్మణపట్టు పంచాయతీలో రూ.6.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అంతేకాకుండా రూ.34.61 కోట్ల సంక్షేమ పథకాలు ప్రజలకు అందించినట్టు వెల్లడించారు. ముళ్లపూడి పంచాయతీలో రూ.4.91 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, రూ.5.63 కోట్ల సంక్షేమ నిధులు ప్రజలకు అందజేసినట్టు తెలిపారు. కుంట్రపాకం, తనపల్లి, ఓటేరు పంచాయతీలలో చేపట్టిన అభివృద్ధిని, అందజేసిన సంక్షేమ ఫలాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న మోహిత్‌రెడ్డి

బాబు హామీలు అమలుగాక.. ప్రజలకు బదులు చెప్పలేక!



పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి

- టీడీపీలో ఉండలేక సిగ్గుతో తలదించుకున్నాం!
- సీఎం జగనన్న సంక్షేమ పథకాలు మెచ్చి వైఎస్సార్‌సీపీలో చేరాం
- డెప్యూటీ మేయర్ అభినయ్ సమక్షంలో పలువురు టీడీపీ నేతల చేరిక

తిరుపతి మంగళం: 'ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలుగాక, బయట ప్రజలు అడిగే ప్రశ్నలకు బదులు చెప్పలేక సిగ్గుతో తలదించుకున్నాం. సీఎం జగనన్న సంక్షేమ పథకాలు మెచ్చి వైఎస్సార్‌సీపీలో చేరాం' అని పలువురు టీడీపీ నాయకులు తెలిపారు. సోమవారం తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నివాసంలో నగరంలోని 35, 36, 50 డివిజన్లకు చెందిన టీడీపీనాయకులు లతారాయల్, మంజుల, సేతుపతితో పాటు సుమారు వంద మంది నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి డెప్యూటీ మేయర్, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షులు పాలగిరి ప్రతాప్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రజలకు మేలు చేయకపోయినా పర్వాలేదు కానీ అబద్ధపు హామీలతో ప్రజలను వంచించడం మంచిది కాదన్నారు. అవసరానికి అనుగుణంగా మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసే ప్రజాద్రోహి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. అలాంటి అబద్ధాలకోరు పార్టీలో ఉండి ప్రజలను మోసగించలేక, రాష్ట్ర ప్రజలకు జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్టు వెల్లడించారు. తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రజల కోసం పడుతున్న తపన, తిరుపతి నగర అభివృద్ధికి వారు చేస్తున్న కృషి అంతాఇంతా కాదన్నారు. అలాంటి నాయకుల వెంట నడిచినా గౌరవమేనని టీడీపీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు మాయమాటలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నయనారు మధుబాల, రుయా అభివృద్ధి కమిటీ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్‌రాయల్, పార్టీ నాయకులు ఎస్కే సురేష్, ఖాదర్‌బాషా, దినేష్‌రాయల్, చందురాయల్, కిరణ్, కేశవ్ పాల్గొన్నారు.

తెప్పపై కల్యాణ వెంకన్న కటాక్షం



పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి, ఉభయ దేవురులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి తెప్పోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం సాయంత్రం తెప్పపై శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారు ఉభయ దేవేరులతో కలిసి విద్యుద్దీపాలంకరణలతో ప్రత్యేకంగా రూపొందించిన తెప్పను అధిరోహించి పుష్కరిణిలో ఐదు చుట్లు తిరుగుతూ భక్తులకు కనువిందు చేశారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అనుగ్రహించారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల భక్తి సంకీర్తనలు, భజనలు ఆకట్టుకున్నాయి. కాగా మంగళవారం శ్రీ ఆండాళ్ అమ్మవారితో కలిసి శ్రీకృష్ణస్వామి వారు తెప్పలపై విహరించనున్నారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయక పాల్గొన్నారు.



తెప్పోత్సవంలో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ అధికారులు

రైలు పట్టాలపై సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతదేహం

గుడుపల్లె : గుడుపల్లె రైల్వే గేటుకు సమీపంలో రైలు పట్టాలపై శ్రీనాథ్(28) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతదేహం లభ్యమైంది. వివరాలు.. శాంతిపురం మండలం శివరాంపురం గడ్డూరు గ్రామానికి చెందిన వెంకటముని కుమారుడు శ్రీనాథ్‌కు 9 నెలల క్రితం కర్ణాటకకు చెందిన సౌమ్యతో వివాహం జరిగింది. దంపతులు ఇద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ శనివారం శివరామపురం గ్రామానికి వచ్చారు. ఆదివారం ఉదయం శాంతిపురం వరకు వెళ్లి వస్తానని భార్యతో చెప్పి శ్రీనాథ్ చెప్పి బైక్‌పై బయలుదేరాడు. కొంతసేపటికి సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబీకులకు అనుమానం వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ తెలియక పోవడంతో వెంటనే రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శ్రీనాథ్ మృతదేహం రైలు పట్టాలపై పడిఉండడం గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి శ్రీనాథ్ కుటుంబీకులకు సమాచారం అందించారు. రైలు పట్టాల సమీపంలోని మామిడి తోటలో శ్రీనాథ్ ద్విచక్రవాహనం గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడిపిన ఐదుగురుకి రూ.50 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి ప్రత్యేక కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి, స్థానిక నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పుచెప్పారు. తిరుపతి నగరంలో వివిధ ప్రాంతాల్లో మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు రికార్డులను పరిశీలించిన న్యాయమూర్తి ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని భవానీశంకరపురం గ్రామ పంట పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తి శవాన్ని సోమవారం రైతులు కనుగొన్నారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పంచనామా నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటనరసింహం తెలిపారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పట్టాలు తప్పిన గూడ్స్‌రైలు

రేణిగుంట: రేణిగుంట రైల్వేస్టేషన్ సమీపంలో ఓ గూడ్స్‌రైలు సోమవారం రాత్రి పట్టాలు తప్పింది. వివరాలు.. చెన్నై నుంచి అస్సాంకు కార్ల లోడుతో బయలుదేరిన గూడ్స్ రైలు సోమవారం రాత్రి రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలోని సౌత్ క్యాబిన్ వద్దకు చేరుకోగానే ఒక బోగీ పట్టాలు తప్పింది. లోకోపైలట్ అప్రమత్తమై ఇంజిన్‌ను ఆపేశారు. రైల్వే ఇంజినీరింగ్ సిబ్బంది చేరుకుని పట్టాలు తప్పిన గూడ్స్‌రైలు బోగీ మరమ్మతులు చేపట్టారు. గంట పాటు రేణిగుంట–చెన్నై మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



పునరుద్ధరణ చర్యలు చేపడుతున్న రైల్వే ఇంజినీరింగ్ సిబ్బంది

మహిళ ఆత్మహత్య

రొంపిచెర్ల: మండలంలోని పెద్దమల్లెల పంచాయతీ బేస్తపల్లెలో సోమవారం ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. దుస్సావారిపల్లెకు చెందిన నరేంద్ర (36) అనే ఆర్మీ ఉద్యోగికి లక్ష్మి(32)తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. లక్ష్మీ గత రెండేళ్లుగా రొంపిచెర్లలో టైలరింగ్ షాపు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో రోజూ బేస్తపల్లెలోని పుట్టింటి నుంచి రొంపిచెర్లకు వచ్చి వెళ్లేది. ఏమైందో తెలియదు కానీ సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. లక్ష్మి మృతదేహాన్ని అన్నమయ్య జిల్లా పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త వచ్చిన తర్వాత పోస్టుమార్టం చేయించనున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

పాకాల: మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై బొలేరో వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమవారం పత్తిపాటివారిపల్లి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. పోలిశెట్టివారిపల్లికి చెందిన పీ.వెంకటముని(82) ద్విచక్ర వాహనంలో పత్తిపాటివారిపల్లి సమీపంలోని పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పట్టుకుని రోడ్డు క్రాస్ చేస్తున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటముని తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందాడు. పాకాల పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



మృతుడు వెంకటముని

రేషన్ బియ్యం స్వాధీనం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం గ్రామం నుంచి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న స్మగ్లర్ శ్రీనును అదుపులోకి తీసుకుని, 12 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ వెంకటనరసింహం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కాపుగాసి పట్టుకున్నట్టు ఆయన వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వద్ద నిందితుడు

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

చంద్రగిరి: ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ హిమబిందు కథనం.. రేణిగుంట మండలం, కృష్ణాపురం గ్రామానికి చెందిన నరసింహులు(55) సోమవారం తెల్లవారుజామున తన ఆటోలో భీమవరానికి బయలుదేరాడు. చిన్నరామాపురం సమీపంలో వెళ్తుండగా రోడ్డుకు అడ్డుగా అడవి పందులు రావడంతో వాటిని తప్పించే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న మట్టిగడ్డను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటో అద్దాలు పగిలి, స్టీరింగ్ ఛాతికి బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



మృతి చెందిన నరసింహులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని తుమ్మూరు గ్రామ సమీపంలో రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బేల్దారి(మేస్త్రీ) కార్మికుడు నిడిగింటి అంకయ్య(41) మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం.. ఓజిలి మండలం, సగుటూరు గ్రామానికి చెందిన అంకయ్య బేల్దారి కార్మికుడు. భార్య పిల్లలతో కలిసి నాయుడుపేట పట్టణంలో నివాసముంటున్నాడు. అంకయ్య కుమారడు భువనేష్ చిలమూన్‌చెన్ గురుకులంలో 6వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం కుమారుడిని చూచేందుకు బైక్‌లో బయల్దేరి వెళ్లాడు. ఆపై అక్కడి నుంచి సగుటూరు గ్రామంలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లి రాత్రి నాయుడుపేటకు వస్తుండగా.. మార్గమధ్యలో తుమ్మూరు వద్ద ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం అంకయ్య బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంకయ్యను 108 అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం సోమవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.



మృతి చెందిన అంకయ్య